
హైదరాబాద్
22-9-2023
సంపుటి:08
సంచిక: 360
పేజీలు: 4
వెల: రూ.5/-
CEO & Editor : G. PRUDHVIRAJ
RNI NO: TELTEL/2016/73311
www.samasamajam.in

# సమ సమాజం

SAMA SAMAJAM TELUGU DAILY
తెలుగు దిన పత్రిక
Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Warangal, Medak, Karimnagar, Kammam, Vishakapatnam, Vijayawada, Ongole

## కమలంలో కలత

- రాష్ట్ర బీజేపీని తలో దిక్కుకు లాగుతున్న వైనం
- జాతీయ నాయకత్వంపై సీనియర్ల అసంతృప్తి!
- సస్పెన్షన్ల లొల్లి.. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లోకి వలస
- నాపై పార్టీ నాయకులే దుష్ప్రచారం చేస్తున్నారు
- లీకులకు నేను వ్యతిరేకిని.. విజయశాంతి ట్వీట్
- రాజకీయాల్లో హత్యలుండవ్: ఈటల వ్యాఖ్య
- కాంగ్రెస్‌లోకి దేవేందర్‌గౌడ్ కొడుకు వీరేందర్!



హైదరాబాద్: జాతీయ నాయకత్వం వైఖరిపై సీనియర్ల తీవ్ర అసంతృప్తి.. కాంగ్రెస్, బీఆర్ఎసలోకి వరుసగా వలసలు.. ఇతర పార్టీల నుంచి చేరికలపై ప్రహసనం.. బలం ఉన్న నాయకుల సస్పెన్షన్.. నేతలపై సొంత పార్టీ వారే దుష్ప్రచారం.. ముఖ్య నాయకుల్లోనే నిర్వేదం..! ఇదీ రాష్ట్రంలో బీజేపీ పరిస్థితి. తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమంటూ జాతీయ, రాష్ట్ర నాయకులు కుండబద్దలు కొడుతున్నా,

2లో

## ప్రజల కోసం బ్రహ్మాండమైన ప్యాకేజీ



- కేసీఆర్ త్వరలో ప్రకటిస్తారన్న కేటీఆర్
- ఢిల్లీ, బెంగళూరుల నుంచి వచ్చేవారు ఎన్నో ప్యాకేజీలు ప్రకటిస్తున్నారు
- వాళ్లకంటే ఎక్కువ సంక్షేమ కార్యక్రమాలు, ప్యాకేజీ ఇచ్చే ఆలోచనలో సీఎం
- దుండిగల్‌లో 1,800 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను ప్రారంభించిన మంత్రి

## రైల్వే కూలీగా రాహుల్!

- ఢిల్లీ ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌కు కాంగ్రెస్ అగ్రనేత
- ఎరుపు చొక్కా, చేతికి బిల్ల ధారణ.. తలపై లగేజీ
- రైల్వే కూలీలతో కూర్చొని వారి సమస్యలపై ఆరా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: 'భారత్ జోడో' యాత్ర స్ఫూర్తినే కొనసాగిస్తున్నారు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ! ఆ యాత్ర ద్వారా కన్యాకుమారి నుంచి కశ్మీర్ దాకా సామాన్యుల



2లో

## 'పాలమూరు-రంగారెడ్డి' జీవోపై సుప్రీంకోర్టుకు ఏపీ

ఎస్ఎల్‌పీ దాఖలు చేయాలని ప్రభుత్వ నిర్ణయం

అమరావతి: పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలు కేటాయించుకుంటూ తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల(జీవో)ను రద్దు చేయాలని



## తరుణీ తరుణం!

- మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు ఓకే
- దేశ రాజకీయాల్లో చరిత్రాత్మక ఘట్టం
- బిల్లుకు రాజ్యసభా సై.. ఏకగీవ్రంగా ఆమోదం
- అంతకుముందు 7 గంటలపాటు సుదీర్ఘ చర్చ
- రిజర్వేషన్లను 2024లోనే అమలు చేయండి
- రాజ్యాంగ సవరణ మీకు పెద్ద పనికాదు: ఖర్గే
- రాజ్యాంగం ప్రకారమే వెళ్తున్నాం
- ఖర్గే విమర్శలకు బీజేపీ చీఫ్ నడ్డా జవాబు
- పార్లమెంటు చరిత్రలో సువర్ణాధ్యాయం
- సభ్యులందరికీ ధన్యవాదాలు: ప్రధాని మోదీ



2లో

న్యూఢిల్లీ, సెప్టెంబరు 21: భారత రాజకీయ ముఖచిత్రంపై చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. చట్ట సభల్లో మహిళలకు పట్టం కట్టే దిశగా కీలక ఘట్టం పూర్తయింది. మహిళా రిజర్వేషన్ బిల్లుకు పార్లమెంటు జై కొట్టింది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33 శాతం మేర రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. ఈ బిల్లు బుధవారం లోక్‌సభలో పాస్ అయింది. తాజాగా రాజ్యసభలోనూ బిల్లు ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. గురువారం పెద్దల సభలో చర్చల అనంతరం బాగా పొద్దుపోయాక బిల్లు మీద ఓటింగ్ జరిగింది. సభకు హాజరైన 215 మంది బిల్లుకు అనుకూలంగా ఓటు వేశా రు. అంతకుముందు మహిళా బిల్లును కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లుపై ఏడు గంటల పాటు సుదీర్ఘ చర్చ జరిగింది. వివిధ పార్టీల సభ్యులు చర్చలో భాగంగా మాట్లాడారు. వారు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం తరపున మంత్రులు సమాధానం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆ పార్టీ రాజ్యసభాపక్ష నేత మల్లికార్జున ఖర్గే.. ఇప్పటికప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లును అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. "చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల అమలు ఎప్పటిదాకానో ఎందుకు? వచ్చే ఏడాది జరిగే ఎన్నికల నుంచే అమలు చేయండి. రాజ్యాంగ సవరణ పెద్ద పనికాదు.

2లో

## కెనడా పౌరులకు 'నో' వీసా

- కెనడా రాజధాని అట్టావాలోని భారత హైకమిషన్ కార్యాలయం
- ఢిల్లీలోని కెనడా హైకమిషన్ కార్యాలయం
- భద్రతా కారణాలతో కెనడాలో కార్యకలాపాలు సాగడం లేదన్న కేంద్రం
- భారత హైకమిషన్లు, కాన్సులేట్లకు బెదిరింపులు వస్తున్నాయని వెల్లడి

న్యూఢిల్లీ: భారత్, కెనడా మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ రాజుకుంటున్నాయి. గత జూన్‌లో ఖలిస్తాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య వెనుక భారత్ హస్తం ఉందని కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రూడో ఆరోపించడంతో ఇరు దేశాలు ఢీ అంటే ఢీ అంటున్నాయి.

2లో





## 35 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

- ఈ నెలాఖరుకు విడుదల చేయాలని కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ నిర్ణయం
- ఇద్దరు పోటీపడుతున్న చోట అక్టోబర్ తొలివారంలో ప్రకటన
- టికెట్ రాని అభ్యర్థులకు నేరుగా కాంగ్రెస్ పెద్దలతో హామీలు
- వచ్చే నెల రెండో వారానికల్లా మొత్తం అభ్యర్థుల ప్రకటన
- వరుసగా మూడు సార్లు ఓడిన చోట్ల అభ్యర్థులను మార్చాలని సమావేశంలో అభిప్రాయం
- కనీసం 35శాతం గెలుపు అవకాశమున్న పేర్లు షార్ట్ లిస్ట్‌లోకి..
- ఖమ్మం జిల్లాలో టికెట్లపై పొంగులేటి విజ్ఞప్తులు
- ఈ నెలాఖరుకు విడుదల చేయాలని కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ నిర్ణయం
- వచ్చే నెల రెండో వారానికల్లా పూర్తిస్థాయి జాబితాలు ప్రకటించేలా కసరత్తు

న్యూఢిల్లీ: రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల కోసం వేగంగా సన్నద్ధమవుతున్న కాంగ్రెస్ పార్టీ.. ఈ నెలాఖరులోగా అభ్యర్థుల తొలి జాబితా ప్రకటించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. తొలి విడతలో బలమైన, ముఖ్యమైన అభ్యర్థులతో ఏకాభిప్రాయం ఉన్న 30%--%35 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించాలని నిర్ణయించినట్టు తెలిసింది. తొలి జాబితాలో పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సీతక్క, పొదెం వీరయ్య, శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, దామోదర రాజనర్సింహ, జీవన్‌రెడ్డి, జి.వినోద్, షబ్బీర్‌అలీ, సంపత్‌కుమార్, వంశీచంద్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వర్‌రావు, ఫిరోజ్‌ఖాన్, ప్రేమ్‌సాగర్‌రావు, అంజన్‌కుమార్ యాదవ్, పద్మావతిరెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి, విజయరమణారావు, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వంశీకృష్ణ తదితరులు పేర్లు ఉండొచ్చని భావిస్తున్నారు.

2లో

## జైల్లో బాబును చంపేసే కుట్ర

- బయటఉంటే ఆయనకు జెడ్ ప్లస్ భద్రత
- అందుకే అక్రమంగా అరెస్టుచేసి జైలుకు..
- అక్కడ హాని తలపెట్టాలని ప్రయత్నాలు
- దోమలు కుడుతున్నా పట్టించుకోవడంలేదు
- ఇప్పటికే జైలులో డెంగీతో ఓ ఖైదీ మృతి
- యువ నేత లోకేశ్ సంచలన ఆరోపణ

అమరావతి: టీడీపీ అధినేత చంద్రబాబును జైల్లో అంతం చేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన తనయుడు, ఆ పార్టీ యువ నేత నారా లోకేశ్ సంచలన ఆరోపణ చేశారు. గురువారం ఆయన దీనిపై ఒక ట్వీట్ చేశారు.



2లో

# జైల్లో బాబును చంపేసే కుట్ర

(మొదటి పేజీ తరువాయి)

"చంద్రబాబును జైల్లో అంతం చేయడానికే ఆయనను సైకో జగన్ అక్రమంగా అరెస్టు చేయించాడన్న అనుమానాలు బలపడుతున్నాయి. ఆధారాలు లేని కేసులో అరెస్టు చేసి బెయిల్ రాకుండా చేసి.. రాజమండ్రి జైల్లోనే చంద్రబాబును చంపడానికి ప్రణాళికలు వేస్తున్నారు. బయట జడ్ ప్లస్ భద్రతతో ఉండే ప్రతిపక్ష నేతకు జైల్లో హాని తలపెట్టేలా సర్కారు కుట్ర నడుస్తోంది. చంద్రబాబుకు జైల్లో భద్రత లేదు. విపరీతంగా దోమలు కుడుతున్నాయని చెప్పినా జైలు అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదే జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరానికి చెందిన గంజేటి వీర వెంకట సత్యనారాయణ డెంగీ బారినపడి మరణించారు. చంద్రబాబును కూడా ఇదే విధంగా ఇబ్బందిపెట్టాలని సైకో జగన్ కుతంత్రాలు పన్నుతున్నాడు. చంద్రబాబుకు ఏం జరిగినా దానికి సైకోదే బాధ్యత" అని లోకేశ్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. రాజమండ్రి జైల్లో ఖైదీ డెంగీతో చనిపోయినట్లు వచ్చిన వార్త క్లిప్పింగ్‌ను ఆయన తన ట్వీట్‌కు జత చేశారు. డెంగీతో బాధపడుతున్న ఖైదీని కాకినాడ జీజీహెచ్‌లో చేర్చారని, అక్కడ చికిత్స పొందుతూ అతడు బుధవారం మరణించాడని ఆ వార్త తెలిపింది.

# తరుణీ తరుణం!

(మొదటి పేజీ తరువాయి)

మీరు తలుచుకుంటే ఇప్పుడే చేసేయొచ్చు. ఐనా 2031 వరకు ఆగ డం అంటే అర్థం ఏమిటి?" అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు, ఆ పార్టీ రాజ్యసభా పక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. జిల్లా పరిషత్, పంచాయతీల్లో మహిళా రిజర్వేషన్ ఉన్నందున చట్టసభల్లోనూ అమలు చేసేందుకు ఇబ్బంది ఏమిటని నిలదీశారు. 'రేపటి పనిని నేడే చేయండి.. నేటి పనిని ఇప్పుడే చేసేయండి' అంటూ ప్రఖ్యాత కవి కబీర్‌దాస్ పద్యాన్ని ఖర్గే ఉటంకించారు. మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమల్లోకి తేవాలంటూ ఖర్గే గట్టిగా డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్ కలగజేసుకుని.. సీట్లో కూర్చోవాల్సిందిగా కోరారు. అయినా, ప్రసంగం కొనసాగించిన ఆయన.. ఇందులో చట్ట వ్యతిరేకం, ఇతరత్రా ఏమీ లేదని రిజర్వేషన్ అమలుకు తమ పార్టీ సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దీంతో ఖర్గే మైక్‌ను ఆఫ్ చేసిన ధన్‌ఖడ్.. 'ఇది ఎగువ సభ.. పెద్దల సభ' అని పేర్కొంటూ బీజేపీ అధ్యక్షు డు జేపీ నడ్డాను మాట్లాడాల్సిందిగా కోరారు. కాగా, ఖర్గే విమర్శలకు కౌంటర్‌గా నడ్డా తన ప్రసంగంలో వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించి రాజ్యాంగం ప్రకారం సరైన పద్ధతిలో వెళ్లాలని భావిస్తున్నామని స్పష్టం చేశారు. గత తొమ్మిదేళ్లుగా అధికారంలో ఉన్నా.. మహిళా రిజర్వేషన్ బిల్లును ఎందుకు తేలేదనే ప్రశ్నకు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ "ఏకాభిప్రాయాన్ని తీసుకురావడాన్నే మేం నమ్ముతాం" అని వ్యాఖ్యానించారు. కాగా, చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్లు కల్పిస్తూ రూపొందించిన 128వ రాజ్యాంగ సవరణ బిల్లు బుధవారం లోక్‌సభలో ఆమోదం పొందిన సంగతి తెలిసిందే. తదుపరి ప్రక్రియలో భాగం గా గురువారం రాజ్యసభలో పెట్టగా పార్టీలకు అతీతంగా సభ్యులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా మేఘ్వాల్ మాట్లాడుతూ మహిళా అభ్యున్నతికి మోదీ ప్రభుత్వం అనేక చ ర్యలు చేపట్టిందన్నారు. మరోవైపు బిల్లుపై చర్చకు ఏడున్నర గంటల సమ యం ఇచ్చినట్లు ఛైర్మన్ ధన్‌ఖడ్ తెలిపారు. పీటీ ఉష, కనిమొళి (డీఎంకే), జయాబచ్చన్ (ఎస్పీ), ఫౌజియా ఖాన్ (ఎన్సీపీ), డోలాసేన్ (టీఎంసీ).. చర్చ సమయంలో సభా కార్యకలాపాల నిర్వహణకు ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు. కాగా, లోక్‌సభలో మహిళా బిల్లు ఆమోదం పొందడం.. పార్లమెంటు చరిత్రలో సువర్ణాధ్యాయం అని ప్రధాని మోదీ కొనియాడారు. సభా నాయకుడిగా.. సభ్యులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

**2011 జనాభా లెక్కలనే తీసుకోవాలి: కేకే**

జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన అనంతరం కాకుండా మహిళా రిజర్వేషన్ల ప్రక్రియను వేగిరం చేయాలని పలువురు సభ్యులు కోరారు. 2011 నాటి లెక్కలనే ప్రామాణికంగా తీసుకోవాలని, నియోజకవర్గాల పునర్విభజన చేపట్టాలని బీఆర్ఎస్ ఎంపీ కె.కేశరావు కోరారు. రాజ్యసభ, శాసనమండళ్లలోనూ మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి డిమాండ్ చేశారు. టీడీపీ ఎంపీ కె. రవీంద్రకుమార్, బీఆర్ఎస్ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, వైసీపీ సభ్యుడు సుభాష్ చంద్రబోస్ సైతం చర్చలో పాల్గొన్నారు.

## 'పాలమూరు-రంగారెడ్డి' జీవోపై సుప్రీంకోర్టుకు ఏపీ

సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్(ఎస్ఎల్‌పీ) దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆ జీవోపై విచారణ చేపట్టడం తమ పరిధిలోకి రాదంటూ ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన ఇంటర్ లొకేటరీ అప్లికేషన్(ఐఏ)ను తిరస్కరిస్తూ కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్(కేడబ్ల్యూడీటీ-2) బుధవారం తీర్పు ఇచ్చింది. ఈ అంశంపై మరో న్యాయస్థానాన్ని ఆశ్రయించే స్వేచ్ఛ ఏపీ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేసింది. దీంతో సుప్రీంకోర్టును ఆశ్రయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమైంది. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు నీటి కేటాయింపుల వల్ల రాష్ట్ర హక్కులకు విఘాయితం కలుగుతుందని నివేదించనుంది. ఆ జీవోను రద్దు చేయడం ద్వారా ఏపీ హక్కులను పరిరక్షించాలని సుప్రీంకోర్టుకు విన్నవించనుంది.

# కెనడా పౌరులకు 'నో' వీసా

(మొదటి పేజీ తరువాయి)

ఇరు దేశాలు దౌత్య ప్రతినిధుల్ని వెనక్కి తీసుకునే వరకు వెళ్లిన ఈ వ్యవహారంలో కెనడాకు షాకిస్తూ భారత్ మరో నిర్ణయం తీసుకుంది. కెనడా పౌరులకు వీసాల మంజూరును భారత్ తాత్కాలికంగా నిలిపివేసింది. భద్రతా కారణాల రీత్యా ఈ వీసాలను ఆపేసినట్టు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కెనడాలో భారత హైకమిషన్లు, కాన్సులేట్లకు రక్షణ లేదని, వాటికి బెదిరింపులు వస్తున్నాయని అందుకే తాత్కాలికంగా వీసాలను నిలిపివేసినట్టుగా తెలిపింది. అంతే కాకుండా భారత్‌లో ఉన్న కెనడా దౌత్యసిబ్బంది సంఖ్య తగ్గించుకోవాలని చెప్పింది. మరోవైపు కెనడాలో భారత్ పౌరులు అప్రమత్తంగా ఉండాలన్న కేంద్రం సూచనల్ని కెనడా ప్రభుత్వం తిరస్కరించింది. ప్రపంచంలో కెనడా అత్యంత సురక్షితమైన దేశమని పేర్కొంది. తమ దేశంలో భారత పౌరులకు వచ్చే ఇబ్బందేమీ లేదని పేర్కొంది. వీసా దరఖాస్తులను పరిశీలించడానికి ఏర్పాటైన ఒక ప్రైవేటు ఏజెన్సీ బీఎల్ఎస్ ఇంటర్నేషనల్ గురువారం నాడు తాత్కాలికంగా వీసాల పరిశీలన నిలిపివేస్తున్నట్టు ప్రకటించింది. నిర్వహణ కారణాలతోనే ఆపేస్తున్నట్టు వెల్లడించింది. ఆ తర్వాత కాసేపటికే విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి అరిందమ్ బాగ్చి విలేకరులతో మాట్లాడుతూ ఇరు దేశాల మధ్య భద్రతా పరమైన ఉద్రిక్తతల కారణంగా వీసా దరఖాస్తుల ప్రక్రియ ముందుకు సాగడం లేదని తెలిపారు.

# ప్రజల కోసం బ్రహ్మాండమైన ప్యాకేజీ

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్/దుండిగల్: ఎంతో కాలం అధికారంలో ఉన్నా ఏమీ చేయని వాళ్లు.. చేసింది చెప్పుకోవ డానికి ఏమీ లేనివాళ్లు ఇప్పుడు తమ కు అవకాశమిస్తే ఎన్నో చేస్తామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారని, వారి మాటలు నమ్మొద్దని రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కె.తారక రామారావు ప్రజలను హెచ్చరించా రు. సంక్రాంతి ముందు గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లు ఎన్నికల ముందు వచ్చేవాళ్ల మాటలతో మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ, బెంగళూరుల నుంచి వచ్చేవారు ఎన్నో ప్యాకేజీలు ప్రకటిస్తున్నారని, వాళ్లు చెప్పిన దానికంటే ఎక్కువ సంక్షేమ కార్యక్ర మాలు, బ్రహ్మాండమైన ప్యాకేజీ ఇచ్చే ఆలోచన బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఉందని, ఆ విషయాల్ని ఆయనే త్వరలో ప్రకటిస్తారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీ స్కీముల్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ మంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని దుండిగల్‌లో నిర్మించిన 1,800 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పట్టాలను కేటీఆర్ గురువారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

**'డబుల్' లబ్ధిదారుల్లో బీజేపీ, కాంగ్రెస్ నేతలు**

పేదలు, రైతులపై కేసీఆర్‌కున్న ప్రేమ దేశంలో మరెవ్వరికీ లేదని కేటీఆర్ చెప్పారు. ప్రగతి రథ చక్రాన్ని ఆపేందుకు ఇష్టమొచ్చినట్లుగా హామీలిస్తు న్న వారి మాటలు నమ్మి మోసపోవద్దని, పనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎలాంటి పక్షపాతం లేకుండా ఆన్‌లైన్ లాటరీ ద్వారా ఎంపిక చేశామని తెలిపారు. జగద్గిరిగుట్ట డివిజన్‌లోని కాంగ్రెస్ మహిళా అధ్యక్షు రాలు కౌసల్యకు, బీజేపీ నాయకురాలు సునీతకు కూడా ఇళ్లు వచ్చాయని చెప్పారు. తొలిదశలో అర్హులకు లక్ష ఇళ్లు ఇస్తుండగా, అర్హులైన మిగతా మూడున్నర లక్షల మందికి కూడా ఇచ్చే బాధ్యత తమదేనని అన్నారు. ఈ రోజుతో 30 వేల ఇళ్ల పంపిణీ పూర్తవుతుండగా, త్వరలోనే మిగతా 70 వేల ఇళ్లు కూడా అందజేస్తామన్నారు. లక్ష ఇళ్ల నిర్మాణా నికి ప్రభుత్వానికైన ఖర్చు దాదాపు రూ.10 వేల కోట్లయితే, మార్కెట్ రేటు ప్రకారం దాదాపు రూ. 50 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల విలువైన ఆస్తిని పేదల చేతుల్లో పెడుతున్న ప్రభుత్వం తమదని కేటీఆర్ పేర్కొన్నారు. దుండిగల్‌కు త్వరలోనే కొత్త పరిశ్రమ రానుందని తెలిపారు.

**ఇలాంటి ఇళ్లు ఇంకెక్కడైనా ఉన్నాయా ?**

మన రాష్ట్రం కాక దేశంలో ఉన్న మరో 27 రాష్ట్రాల్లో, కాంగ్రెస్, బీజేపీ పాలిత ప్రాంతాల్లో ఎక్కడైనా ఇలాంటి డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఉన్నాయేమో చూపిస్తారా? అంటూ బీజేపీ, కాంగ్రెస్ నేతలకు కేటీఆర్ సవాల్ విసిరారు. పేదలకు ఇలాంటి ఇళ్లు ఇస్తున్న రాష్ట్రం దేశంలోనే ఎక్కడా లేవని చెప్పారు. ఇల్లు కట్టి చూడు.. పెళ్లి చేసి చూడు.. అని పెద్దలు అంటారని, నిరుపేద ప్రజలకు ఇళ్లు కట్టించి, పెళ్లి చేయించి ముఖ్యమంత్రి కేసీఆర్ వారికి మేనమామగా నిలిచారని పేర్కొన్నారు.

**చాయ్ అమ్ముకో.. దేశాన్ని మోసం చేయొద్దు**

ఇంటి పట్టా అందుకున్న ఒక మహిళను కేటీఆర్ ఏం చేస్తావంటూ ప్రశ్నించారు. ఆమె తాను చా య్ అమ్ముతానని చెప్పడంతో 'చాయ్ అమ్ము కోవాలి.. కానీ దేశాన్ని మోసం చేయొద్దు' అని అన్నారు. ఏమీ అర్థం కాక ఆమె తెల్లముఖం వేయడంతో.. 'నీ గురించి కాదులే.. వేరేవా ళ్లు ఉన్నారు.. వారి గురించి చెబుతున్నా' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీని ప్రస్తావించారు.

# 35 మందితో కాంగ్రెస్ తొలి జాబితా!

(మొదటి పేజీ తరువాయి)

అక్టోబర్ రెండో వారానికి పూర్తి జాబితా... అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఇప్పటికే హైదరాబాద్‌లో తొలి భేటీ జరిపిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ.. గురువారం ఢిల్లీలోని కాంగ్రెస్ వార్‌రూమ్‌లో రెండో భేటీ నిర్వహించింది. కమిటీ ఛైర్మన్ మురళీధరన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో కమిటీ సభ్యులతో పాటు రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మధుయాష్కీగౌడ్, ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు, ఇతర కార్యదర్శులు పాల్గొన్నారు. సుదీర్ఘంగా 8 గంటల పాటు జరిగిన ఈ భేటీలో 119 నియోజకవర్గాల నుంచి షార్ట్‌లిస్ట్ చేసిన 300 పేర్లపై చర్చించారు. అందులో ఒకే అభ్యర్థి ఉన్న స్థానాలు 30-35 వరకు ఉండగా.. రెండేసి పేర్లున్న స్థానాలు 20%--%30, ముగ్గురి చొప్పున ఉన్నవి 30-35, నలుగురు, ఆపైన పోటీపడుతున్న స్థానాలు 10-15 వరకు ఉన్నట్టు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఇందులో ఒకే అభ్యర్థి ఉన్న జాబితాకు పార్టీ కేంద్ర ఎన్నికల కమిటీ ఆమోదం తీసుకుని.. ఈ నెలాఖరులోగా ప్రకటించాలని నిర్ణయించినట్టు సమాచారం. అక్టోబర్ తొలివారంలో రెండో జాబితా, రెండో వారంలో తుది జాబితా ప్రకటించాలని యోచనకు వచ్చినట్టు తెలిసింది. వరుసగా మూడుసార్లు ఓడిన నేతలకు టికెట్లు ఇవ్వకూడదని సమావేశంలో అభిప్రాయం వ్యక్తమైనట్టు తెలిసింది. ఇలాంటి నియోజకవర్గాలు 6 నుంచి 8 వరకు ఉన్నట్టు సమాచారం.

**సర్వేల ఆధారంగా..**

స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఎన్నికల వ్యూహకర్త సునీల్ కనుగోలు తాము చేసిన సర్వేల నివేదికను అందజేసినట్టు తెలిసింది. ఇద్దరు, ముగ్గురు, అంతకన్నా ఎక్కువ మంది పోటీపడుతున్న స్థానాల్లో ఎవరెవరికి ఎంత శాతం గెలుపు అవకాశాలు ఉన్నాయన్న వివరాలను అందజేసినట్టు సమాచారం. దీనిని పరిగణనలోకి తీసుకున్న కమిటీ నేతలు.. అందులో నియోజకవర్గాల వారీగా 35 శాతానికిపైగా గెలుపు అవకాశాలున్న నేతల పేర్లను పరిగణనలోకి తీసుకుంటూ షార్ట్ లిస్ట్ సిద్ధం చేసినట్టు తెలిసింది. మరోవైపు బీజేపీ నుంచి చేరికలు ఉంటాయన్న అంశం కూడా భేటీలో ప్రస్తావనకు వచ్చింది. అలా చేరే అవకాశమున్న స్థానాలకు అభ్యర్థుల ప్రకటనను వారం పాటు పెండింగ్‌లో పెట్టాలని అభిప్రాయానికి వచ్చినట్టు తెలిసింది.

**టికెట్ దక్కని నేతలకు హామీలు!**

టికెట్ ఆశించి దక్కని నేతలకు వారి ప్రాధాన్యాన్ని బట్టి నేరుగా హైకమాండ్ పెద్దలతో పార్టీ, ప్రభుత్వ పదవులపై హామీలు ఇప్పించాలని స్క్రీనింగ్ కమిటీ భేటీలో నిర్ణయించినట్టు తెలిసింది. పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ పదవులతోపాటు పార్టీలో ప్రాధాన్యం కల్పించే విషయాన్ని పార్టీ పెద్దలు మల్లికార్జున ఖర్గే, రాహుల్, ప్రియాంకగాంధీలతో చెప్పించనున్నారని సమాచారం. కాగా, టికెట్ ఆశిస్తున్న కొందరు నేతలు ఢిల్లీకి వెళ్లి అక్కడే మకాం వేసి ముఖ్య నేతలను ప్రస న్నం చేసుకునే ప్రయత్నాలు మొదలుపెట్టారు.

**6 చోట్ల ప్రాధాన్యత కోరిన పొంగులేటి!**

స్క్రీనింగ్ కమిటీ భేటీ ముందు ఠాక్రే, రేవంత్, ఉత్తమ్, భట్టిలతో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి భేటీ అయ్యారు. ఖమ్మం జిల్లాకు సంబంధించి అభ్యర్థుల ఎంపికపై తన అభి ప్రాయాలను నేతలకు పొంగు లేటి వివరించి నట్టు తెలిసింది. ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, కొత్తగూడెం, అశ్వారావుపేట, పినపాక నియోజ కవర్గాల్లో తన వర్గం నేతలకు అవకాశం ఇవ్వా లని ఆయన కోరినట్టు సమాచారం. తనతో పాటు పార్టీలో చేరిన తుడి మేఘారెడ్డికి వన పర్తిలో ప్రాధాన్యం ఇవ్వాలని ప్రతిపాదించి నట్టు తెలిసింది. సర్వేలతో పోల్చి చూసి ఖరారు చేస్తామని ఠాక్రే హామీ ఇచ్చినట్టు తెలిసింది.

# రైల్వే కూలీగా రాహుల్!

(మొదటి పేజీ తరువాయి)



బతుకు కష్టాలను దగ్గర నుంచి చూసిన ఆయన, తాజాగా ఢిల్లీ రైల్వే కూలీల్లో ఒకరిగా కలిసిపోయి వారితో మాట్లాడారు. గురువారం ఆనంద్ విహార్ రైల్వే స్టేషన్‌కు రాహుల్ వెళ్లారు. రైల్వే కూలీల మధ్యే కూర్చొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాసేపు రైల్వే కూలీగా మారిపోయారు. తాను ధరించిన తెలుపు రంగు టీ షర్టుపైనే కూలీలు ధరించే ఎరుపు రంగు చొక్కాను వేసుకొని, పోర్టర్ లైసెన్స్ బిళ్లను చేతికి కట్టుకున్నారు. అక్కడ గుమిగూడిన జనం ఈలలు, చప్పట్ల నడుమ చొక్కా చేతులను మోచేతుల దాకా మడిచి.. ప్రయాణికుల లగేజీని తన తలమీదకు ఎత్తుకున్నారు. అనంతరం ఎరుపు రంగు చొక్కాతోనే కూలీలు బస చేసే గదులకు వెళ్లి పరిశీలించారు. అక్కడా కూలీలు సౌకర్యాల లేమిపై తమ గోడును ఆయనకు చెప్పుకొన్నారు. రాహుల్‌తో కలిసి వారంతా సెల్ఫీ దిగారు. రాహుల్ గాం?ధీని కలవాలనుందని ఆకాంక్షను వ్యక్తం చేస్తూ కొందరు రైల్వే కూలీలు ఇటీవల ఓ వీడియో ద్వారా విజ్ఞప్తి చేశారని.. అందుకే పార్టీ అగ్రనేత వారిని కలిశారని కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్'లో రాసింది. రైల్వే కూలీలను రాహుల్ కలిసిన తాలూకు ఫొటోలను కూడా పోస్ట్ చేసింది. ఆగస్టులో ఢిల్లీలోని ఆజాద్‌పూర్ మండీకి వెళ్లిన రాహుల్, అక్కడి వ్యాపారులతో మాట్లాడారు. అంతకుముందు జూలైలోనూ హరియాణాలోని మదీనా గ్రామంలో బురద పొలంలోకి దిగి మరీ వరినాట్లు వేస్తున్న కూలీలతో ముచ్చటించారు.

నరేంద్ర మోదీ ప్రధాని అయ్యాక ప్రజాస్వామ్యానికి సంబంధించి అన్నీ మారిపోయాయని, వ్యవస్థ బలహీనమయిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ అన్నారు. ప్రజాస్వామ్యంపై దాడులు జరుగుతున్నాయని, దీన్ని అడ్డుకోవడానికి చాలా మంది పోరాటాలు చేస్తున్నారని చెప్పారు. ఒకవేళ ఈ పోరాటాలు ఆగిపోతే దేశంలో ప్రజాస్వామ్యం ఉండదని అన్నారు. ఈ నెల ప్రారంభంలో నార్వేలోని ఓస్లో విశ్వవిద్యాలయంలో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. అందుకు సంబంధించిన వీడియోను గురువారం కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. దేశంలో ప్రజాస్వామ్య హత్యను విపక్షాల కూటమి అయిన ఇండియా సహించబోదని చెప్పారు. వ్యవస్థలన్నింటినీ ఆరెస్సెస్ ఆక్రమించుకోకుండా అడ్డుకుంటామని, దేశ సంపదను 2-3 వ్యాపార సంస్థల చేతిలో పెట్టడాన్ని ఆమోదించబోమని తెలిపారు. దేశంలో చాలా మందికి మాట్లాడే అవకాశం ఉండడం లేదని, రాజకీయ నాయకత్వాన్ని అణచివేస్తున్నారని చెప్పారు. తనపైనా 24 కేసులు ఉన్నాయని, 55 గంటల పాటు విచారించారని తెలిపారు. పరువు నష్టం కేసులో దేశంలో తొలిసారిగా తనకు రెండేళ్ల జైలు శిక్ష విధించారని అన్నారు.

# కమలంలో కలత

(మొదటి పేజీ తరువాయి)

కొద్ది రోజులుగా పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాలు మాత్రం కేడర్‌ను తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. సీనియర్ నేతల మధ్య ఉన్న విభేదాలు బహిర్గతం అవుతుండడంతో.. ఇది ఎక్కడకు దారితీస్తుందోనని వారిలో బెంగ పట్టుకుంది. ఎన్నికల ముంగిట.. లోపాలను సరిచేసుకుంటూ ఏ పార్టీ అయినా సాధ్యమైనంత బలపడాలని చూస్తుంది. కానీ, రాష్ట్ర బీజేపీలో దీనికి భిన్నంగా ఉంది. చేరికల ప్రక్రియ ప్రహసనంగా మారిందని పార్టీ నేతలు పలువురు విచారం వ్యక్తం చేస్తున్నారు. బీజేపీలోకి వచ్చేందుకు సిద్ధం అవుతున్నవారిని కొందరు సీనియర్లు అడ్డుకుంటున్నారని పేర్కొంటున్నారు. "ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లోని కీలక నియోజకవర్గాల నుంచి పట్టున్న నాయకులను చేర్చుకునే ప్రయత్నాలు చురుగ్గా జరిగాయి. అయితే, ఒకరిద్దరు సీనియర్లు మోకాలడ్డడంతో వారు మరో పార్టీలోకి వెళ్లిపోయారు" అని ఇటీవలి ఘటనలను ఉదహరించారు. కాగా, మాజీ మంత్రి కృష్ణాయాదవ్, చీకోటి ప్రవీణ్ ఉదంతాలతో పార్టీ ఇమేజ్ మరింత దిగజారిందని ఓ సీనియర్ నాయకుడు అభిప్రాయపడ్డారు. "వారిని ఆహ్వానించింది ఎవరు? పార్టీ కార్యాలయానికి అట్టహాసంగా వస్తే చివరి నిమిషంలో ముఖ్య నేతలు ఎందుకు ముఖం చాటేశారు? అసలు ఎందుకు ఇంత గందరగోళం?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. జిట్టా బాలకృష్ణారెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడిగానూ పనిచేసిన యెన్నెం శ్రీనివాసరెడ్డి సస్పెన్షన్ వ్యవహారం కూడా పార్టీ కేడర్‌లో చర్చనీయాంశమైంది. వేటు అనంతరం వీరు బీజేపీ నాయకత్వంపై విమర్శలు చేశారు. వాటిని నాయకత్వం తిప్పికొట్టలేదన్న అభిప్రాయం పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతోంది. సినీ నటి, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు విజయశాంతి.. తాజాగా సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు మాత్రం మరింత చర్చనీయాంశమైంది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాను అభిమానిస్తానంటూ రెండు రోజుల కిందట విజయశాంతి చేసిన ట్వీట్ పార్టీలో వివాదాస్పదమైంది. వెంటనే ఆమె దానిని తొలగించారు. అయితే, గురువారం చేసిన ట్వీట్ సంచలనంగా మారింది. "చిట్‌చాట్ల పేరుతో ఏదో ఒక వ్యూహంతో చేసే కార్యాచరణ నాకు అలవాటు లేదు. పార్టీకి ఏది ముఖ్యమో ఆ అంశాలను 16న ప్రధాన నేతలకు స్పష్టం చెప్పా. ఆ విషయాలను లీకేజీల పేరిట బయటకు చెప్పడానికి నేను వ్యతిరేకిని. ఇదంతా తెలిసి కూడా మా పార్టీ నేతలు కొందరు.. బీజేపీకి రాములమ్మ దూరం అంటూ సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయిస్తున్నారు. ఇది ఖండించదగినది" అంటూ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. దీంతో వ్యూహాలు వెల్లడించే నాయకులు ఎవరు? విజయశాంతి కాంగ్రెసలోకి వెళ్తారని ప్రచారం చేస్తున్నది ఎవరు? అంటూ పార్టీ వర్గాలు చర్చించుకున్నాయి. తమ తీరును తప్పుబడుతూ, మాజీ మంత్రి ఈటల రాజేందర్ వైఖరిని విమర్శిస్తూ ఇటీవల కొందరు సీనియర్లు నిర్వహించిన రహస్య భేటీపై బీజేపీ జాతీయ నాయకత్వం ఆరా తీసింది. సమావేశంలో అసలు వారు ఏం మాట్లాడుకున్నారు? అంటూ మీడియా కథనాల ఆధారంగా ప్రత్యేకంగా నివేదిక తీసుకుందని బీజేపీ సీనియర్ నేత ఒకరు వెల్లడించారు. ఈ క్రమంలోనే తనకు వ్యతిరేకంగా జరిగిన సమావేశంపై ఈటల స్పందించారు. "రాజకీయాల్లో హత్యలుండవ్.. ఆత్మహత్యలే ఉంటాయి" అంటూ నర్మగర్భ వ్యాఖ్యలు చేశారు. 'నేను ప్రజలను నమ్ముకున్న వ్యక్తిని. నాకు శత్రువులు ఎవరూ లేరు" అని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నాయకులను ఆకర్షించడం పక్కనబెడితే ఉన్నవారిని బీజేపీ కాపాడుకోలేకపోతోందనే వాదనకు బలం చేకూరుస్తూ ఎన్నికల వేళ ఆ పార్టీకి మరో షాక్ తగలనుంది. అధికార ప్రతినిధి, మాజీ హోం మంత్రి దేవేందర్‌గౌడ్ తనయుడు వీరేందర్‌గౌడ్ బీజేపీకి రాజీనామా చేసేందుకు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ నేత మధుయాష్కీతో కలిసి ఆయన ఢిల్లీ వెళ్లారు. కాంగ్రెస్ పెద్దలను కలిసేందుకే వీరేందర్ వెళ్లారని సన్నిహితులు చెబుతున్నారు. స్వగ్రామం తుక్కుగూడలో కాంగ్రెస్ నిర్వహించిన విజయగర్జన సభకు వచ్చిన స్పందనను చూసి.. వీరేందర్ బీజేపీని వీడాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది.



## ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలని సర్పంచ్ లలితకు వినతి

**వలిగొండ సెప్టెంబర్ 21సమ సమాజం:** వలిగొండ : స్థానిక గ్రామ పంచాయతీ నుండి ఆవాస గ్రామం ఐన మల్లెపెల్లిని ప్రత్యేక గ్రామపంచాయతీ గా ప్రకటింపజేయాలని స్థానిక సర్పంచ్ బోళ్ల లలిత కు ఆ గ్రామస్థులు వినతి పత్రం గురువారం అందజేశారు. ఈ సందర్భముగా పలువురు మాట్లాడుతూ మాగ్రామం ప్రత్యేక గ్రామ పంచాయతీ ఏర్పాటుచేయాలని గ్రామస్తులు తీర్మానం చేసుకొని ప్రత్యేక సమావేదం ఏర్పటు చేసుకొని గ్రామంలో సుమారుగా ఒక వెయ్యి ఓటర్లు ఉన్నారని వెంటనే మల్లెపెల్లిని ప్రత్యేక గ్రామ పంచాయతీ ప్రకటించేటట్లు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి పల్లెర్ల భాగ్యమ్మ రాజు,ఈతాప నర్సింహా, బుంగమట్ల సుధాకర్,రేగు కొమురయ్య,కుక్కల శ్రీనివాస్,శ్రీనివాస్,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే శ్రీ బానోత్ శంకర్ నాయక్ గారు గూడూరు మండలం అయోధ్య పురం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపినారు



**సమ సమాజం:**గూడూరు మండల్ గూడూరు మండల అయోధ్య పురం బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరం వెల్లి భరత్ కుమార్ రెడ్డి గారి మామగారు ముత్తిరెడ్డి జగన్నాథరెడ్డి గారు ఇటీవలే కురవి మండలం మోదులగూడెం గ్రామంలో మృతిచెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపిన ఎమ్మెల్యే శ్రీ బానోత్ శంకర్ నాయక్ గారు ఎమ్మెల్యే గారి వెంట ప్రజాప్రతినిధులు బిఆర్ఎస్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

## కడియం రామచంద్రయ్య గారి సమక్షంలో బిజెపిలో చేరికలు



తిరుమలగిరి మండలం గుండెపురి, సిద్ధి సముద్రం గ్రామాలకు చెందిన టిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గురువారం నాడు తిరుమలగిరి మండల కేంద్రంలోని భాజపా కార్యాలయంలో కడియం రామచంద్రయ్య సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గారి నాయకత్వాన దేశం అభివృద్ధి చెందుతున్న కారణంగా గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అనేకమంది బిజెపి పట్ల ఆకర్షితులవుతున్నారని, రాష్ట్రంలో కుటుంబ అవినీతి పాలనకు వ్యతిరేకంగా ఓటు వేయడానికి ప్రజల సిద్ధంగా ఉన్నారని అన్నారు కార్యక్రమంలో బిజెపి నాయకులు వై దీన్ దయాల్,తిరుమలగిరి రూరల్అధ్యక్షులు వేల్పుల బంగారు రాజు, బొల్లు మల్లయ్య, వంగూరి రమేష్, దేవేందర్ పాల్గొన్నారు పార్టీలో చేరిన వారిలో ధరావత్ సోమన్న, ధరావత్ అనిల్, శ్రీనివాస్, కాలకృష్ణ, అనిల్, రాజేష్, కృష్ణ, రాజు, బొడ్డు లింగయ్య, గుండెబోయిన లింగరాజు, ఉప్పలయ్య, సోమన్న, ధరావత్ అశోక్, తదితరులు సుమారుగా 100 మంది చేరారు.

## పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించిన నెల్లికంటి సత్యం

**చండూరు సెప్టెంబర్ 21 సమ సమాజం:** మాజీ మంత్రివర్యులు స్వర్గీయ శ్రీ పాల్వాయి గోవర్ధన్ రెడ్డి గారి సతీమణి సృజమని మేడం గారు మరణించినారు గురువారం వారి స్వగృహం ఇది కూడా గ్రామంలో సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికట్టు సత్యం గారు సృజమని గారి పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించరు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు . ఈ యొక్క కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, సిపిఐ మండల కార్యదర్శి నడపరాజు సతీష్ కుమార్,సిపిఐ మండల సహాయ కార్యదర్శి పల్లె యాదయ్య,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగల వెంకటేష్,ఎఐటియుసి మండల అధ్యక్షుడు తోటి వెంకన్న,హామీదు, మాదగోని అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## మృతురాలి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళర్పించిన :బుర్ర శ్రీ నివాస్ గౌడ్

**అడ్డగూడూర్ :సమ సమాజం:** అడ్డగూడూరు మండలం లోని బొడ్డుగూడెం గ్రామంలో బుధవారం నాడు ఆర్టీసీ బోల్తా పడి మరణించిన చుక్క యాకమ్మ, కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 25 లక్షల ఎక్స్ గ్రేషియా ,వారికి కుటుంబాలకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, గాయపడ్డవారికి 10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గురువారం నాడు బస్సులో మరణించిన,గాయపడ్డ వారికి బస్సు బాధితుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం ముందు బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసి తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ బస్సులో బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం మూలంగా బస్సులో ప్రయాణించి మరణించిన యాకమ్మ రాములు నిరుపేద కుటుంబాలని, వారిని తక్షణమే ఆదుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమేనన్నారు.నిర్లక్ష్యంగా నడిపిన బస్సు డ్రైవర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజలకు గుంతలమయం గా ఉన్న బొడ్డుగూడెం-పాటిమాట్ల రోడ్డు వెంటనే మరమ్మతులు చేయాలని కోరారు.ఆనంతరం బస్సులో మరణించిన చుక్క యాకమ్మ స్వగ్రామమైన చిన్నపడిశాలలో ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు.ఆయా కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నియోజకవర్గ ఇంచార్జి ఆనంతుల దేవాంజీ, నాయకులు రాచకొండ రమేష్, ఏనుగు బీరుమల్లు, లాధినేని పూర్ణచందర్, చల్ల నర్సింహ్మా, లక్ష్మీ,యాదమ్మ మహేష్, మల్లయ్య రంజిత్ తదితరులు పాల్గొన్నారు.





## పార్లమెంటులో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టాలి

**తెలంగాణ మాదిగ జర్నలిస్ట్స్ ఫోరం వ్యవస్థాపక,రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ**

**తొర్రూర్ సమ సమాజం:** ప్రస్తుత ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లోనే ఎస్సీ ఏబిసిడి వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించి చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ మాదిగ జర్నలిస్ట్స్ ఫోరం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు బూర్గుల నాగేందర్ మాదిగ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద టిఎంఆర్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇటుక రాజు మాదిగ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. గత 29 ఏళ్లుగా జరుగుతున్న వర్గీకరణ పోరాటాన్ని మోడీ గుర్తించాలని అన్నారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే మాదిగ, ఉప కులాల కు జనాభా దమాషా ప్రకారం రిజర్వేషన్లు అందుతాయని అన్నారు. అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రచార సభల్లో ఎస్సీ వర్గీకరణ చేపడతామని ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చాక మొహం చాటేస్తున్నాయని మండిపడ్డారు. గత ఎన్నికల సందర్భంగా నరేంద్ర మోడీ 100 రోజుల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తానని హామీ ఇచ్చి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. ప్రస్తుత పార్లమెంటు సమావేశాల్లోనే వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని దీనికిగాను అన్ని రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. దీక్షకు మద్దతు తెలిపిన వారిలో తెలంగాణ




మాదిగ జర్నలిస్ట్స్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి సుక్క అశోక్ మాదిగ, రాష్ట్ర కోశాధికారి మాంకాల శ్రీనివాస్ మాదిగ, రాష్ట్ర నాయకులు మచ్చ రమేష్ మాదిగ, వేర్పుల మహేష్ మాదిగ, మిర్యాల బాలకృష్ణ మాదిగ,వేర్పుల మహేందర్ మాదిగ,ముతేష్ మాదిగ,సారయ్య మాదిగ తదితరులు ఉన్నారు.

## గ్రేటర్ పరిధిలో రెండవ విడత డబుల్‌బెడ్ రూం ఇండ్ల పంపిణీ

**మంత్రి హరీష్ రావు తో కలిసిలబ్ధిదారులకు పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌లి**

**రాజేంద్ర నగర్ సమ సమాజం:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కొల్లూరులో నిర్మించిన డబుల్ ఇండ్ల పంపిణీని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు తో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం 500 మంది లబ్ధిదారులకు పట్టాలు అందజేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదు. కానీ బీఆర్ఎస్ సర్కార్ మాత్రం పేదలను గుండెల్లో పెట్టి చూసుకుంటుందన్నారు. ఇవాళ ప్రతిపక్షాలు అనేక రకాల మాటలు చెప్తూ ప్రజలను మభ్య పెట్టేందుకు యత్నిస్తున్నాయి. మీరు ఆలోచించండి.. ఆడబిడ్డల పెళ్లిళ్లకు కళ్యాణలక్ష్మి కార్యక్రమం తెచ్చింది కేసీఆర్ కాదా..? కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆడబిడ్డల పెళ్లిళ్లకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా? అని ప్రశ్నించారు. బస్తీ దవఖానాల్లో పేద రోగులకు ఉచితంగా వైద్యం అందిస్తున్నాం. ఉచితంగా మంచినీళ్లు అందిస్తున్నాం. గత ప్రభుత్వాల హయాంలో నల్లా బిల్లు కట్టకపోతే తెల్లారేసరికి కనెక్షన్ కట్ చేసేవారు. కేసీఆర్ హయాంలో మంచినీళ్లు అందించాం. కాంగ్రెస్, బీజేపీ నేతలు మాటలు చెప్పారు.. కానీ చేసి చూపించలేదు అని మండిపడ్డారు. ఇవాళ పనిచేసే వారెవరో, మాటలు చెప్పే వారెవరో దయచేసి ఆలోచించి రాబోయే రోజుల్లో కూడా సరియైన నిర్ణయం తీసుకొని సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకోవాలని ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి రాజేంద్రనగర్ జిహెచ్ఎంసి సర్కిల్ డిసి రవికి రాజేంద్రనగర్ మైలార్దేవరపల్లి డివిజన్ అధ్యక్షులు ప్రేమ్ గౌడ్ రఘు యాదవ్ తదితరులు పాల్గొన్నారు

## మహారాష్ట్ర గవర్నర్ కు అంగన్వాడిల డిమాండ్ల పత్రం

**ఆర్మూర్:సమ సమాజం:** జిల్లా నిజామాబాద్ ఆర్మూర్ మండల కేంద్రంగా 11వ రోజు అంగన్వాడీ కార్మికుల సమ్మె ఉధృతంగా సాగుతోంది. సమ్మెకు అతిథులుగా ముంబై నుంచి విచ్చేసిన ఆలిండియా అంబేద్కర్ యువజన సంఘం జాతీయ నేత మూల్ నివాసి మాలజీ మాట్లాడుతూ కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో ఇంకా కనీస హక్కుల కోసం తమ మహిళలు రోడ్ ఎక్కాల్సిన దౌర్భాగ్యమైన పరిస్థితి రాష్ట్రంలో ఉందని ఆరోపించారు. తెలంగాణ ఆయాలు అంగన్వాడీల సమస్యల నివేదిక మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బైస్ గారికి సమర్పించనున్నామని మాలజీ హామిచ్చారు. పోరాట రూపాలు మార్చుకోవాల్సిందిగా కార్మికులకు ఆయన ఈ సందర్భంగా హితబోధ చేశారు. రాజ్యాంగంలోని సమస్త కార్మిక హక్కులను అమలు చేయాలి, ఆయాలను అంగన్వాడి మహిళల్ని పర్మనెంట్ చేయాలని భీంశక్తి శివశక్తి రాష్ట్ర నేత ఇత్వార్పెట్ లింగన్న డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ అంగులి మాలజీ, సమ్రాట్ అశోక్, మామిడి రాజు, కంబా ప్రణీల్ కుమార్, సంజీవ్ వాగ్మారే, సురేష్ వాగ్మారే సంఘీభావం వ్యక్తపరిచారు. ఇందులో అంగన్వాడీ ప్రాజెక్ట్ ప్రెసిడెంట్ పి.చంద్రకళ, ఏ. లక్ష్మీ,



జగదంబా, లక్ష్మి, వసంత తోపాటు సిఐటియు మండల అధ్యక్షులు కూతడి ఎల్లయ్య, ఎస్.ఎఫ్.ఐ యువనేత నాగరాజ్ యాదవ్ న్యాయమైన నినాదాలతో రోడ్డు అంతటా మారుమోగించారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ వలె సమాజ శ్రేయస్సుకు కృషి చేద్దాం

**ఆర్మూర్ సెప్టెంబర్ 21: సమ సమాజం:** నిజాంబాద్ జిల్లా ఆర్మూర్ నియోజవర్గం పరిధిలో సొంత కులాన్ని బెల్లంగా మార్చుకొని, ఇతర బీసీ ఎస్సి ఎస్టి కులాలతో ఐక్య కార్యాచరణతో బహుజన రాజ్యాధికారం కోసం కృషి చేసిన మహనీయులు కొండా లక్ష్మణ్ బాపూజీ పద్మశాలి. ఆనాడు అగ్ర వర్ణాలకు దీటుగా మంద కృష్ణ మాదిగ వలె తమ "పద్మశాలి" కులాన్ని కూడా ప్రతి వ్యక్తి తమ పేర్ల వెనుక "సోషల్ ఐడెంటిటీ"గా పెట్టుకోవాలని జాతీయ పద్మశాలి మహాసభల్లో ముంబై నందు తీర్మానం చేసిన "కుల గుర్తింపు" పోరాట యోధుడు కె.ఎల్.బి పద్మశాలి గారు. ఇంతేగాకుండా తెలంగాణ తొలిమలి దశ ఉద్యమంలో తన జీవితాన్ని దారబోసిన "సచ్చ తెలంగాణవాది" అని ముంబై నుంచి విచ్చేసిన తెలంగాణ బహుజన ఫోరం (ఎంటిబిఎఫ్) కన్వీనర్ మూల్ నివాసి మాలజీ కొనియాడారు. శివశక్తి భీంశక్తి రాష్ట్ర నేత ఇత్వార్పెట్ లింగన్న మాట్లాడుతూ కొండా లక్ష్మణ్ బాపూజీ చివరి 90ఏండ్ల వయసులో కూడా ఢిల్లీ నడిబొడ్డున ప్రత్యేక రాష్ట్రం కోసం ఆమరణ దీక్ష చేపట్టారని, ఆయన వలె తామందరం నిరంతరం ఈ వ్యవస్థను మార్చి సమసమాజం కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అన్నారు. గురువారం ఆర్మూర్ లోని బాపూజీ విగ్రహం వద్ద నివాళి



కార్యక్రమం జరిగింది. ఆరంభంలో బాపూజీ విగ్రహానికి మమత మాలజీ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఇందులో జర్నలిస్టులైన సమ్రాట్ అశోక్, అంగులి మాలజీ, మామిడి రాజు, శివశక్తి భీంశక్తి ఆర్మూర్ నేత కంబా ప్రణీల్ కుమార్, శ్రీరాంపూర్ జనార్దన్, సంజీవ్ వాగ్మారే, సురేష్ వాగ్మారే, చంద్ పాషా షేక్ పాల్గొన్నారు.



# ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొన్న శంకర్ నాయక్

**మునుగోడు సెప్టెంబర్ 21: సమ సమాజం:** మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నల్లగొండ జిల్ల కాంగ్రెస్ పార్టీ అద్యక్షులు శంకర్ నాయక్ తో సమావేశం కావడం జరిగింది. మునుగోడు లో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని అందరు మరింత కష్టపడి పనిచేస్తే గెలుపు తప్పకుండా మనదే అని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ సీనియర్ నాయకులు నన్నూరి విష్ణువర్ధన్ రెడ్డి, మాజి ఎంపీపీ పోలగోని సత్యం, మునుగోడు నియోజకవర్గ ఎన్ ఎస్ యు ఐ అద్యక్షులు ఎంపీటీసీ బీమనపెల్లి సైదులు, బ్లాక్ కాంగ్రెస్ అద్యక్షులు పాల్వాయి చెన్నారెడ్డి, మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు మేక ప్రదీప్ రెడ్డి, నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రదాన కార్యదర్శి మందుల సైదులు, మునుగోడు యూత్ కాంగ్రెస్ అద్యక్షుడు నక్క వెంకన్న యాదవ్, మునుగోడు టౌన్ ప్రెసిడెంట్ యాసరాని దినేష్, మునుగోడు మండల ప్రధాన కార్యదర్శి కందుల సూర్యప్రకాష్, శింగారం గ్రామ శాఖ కుంభం చెన్నారెడ్డి, కల్వకుంట్ల గ్రామ శాక హనుమంతు, గుండు చెన్న కృష్ణ గౌడ్, రడం వెంకన్న, గుంటుక కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 3న డా, సురభి శ్రీధర్ కు ఇంటర్నేషనల్ హానరీ 2023 భారత్ ఐకాన్ అవార్డు ప్రధానం



**హైదరాబాద్ సెప్టెంబర్ 21సమ సమాజం:** వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో, పీస్ ఆఫ్ ఇండియా, స్ఫూర్తి ఇంటర్నేషనల్ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో అక్టోబర్ 3 న హైదరాబాద్ బొగ్గులకుంట తిలక్ నగర్ రోడ్డు లోని, తెలంగాణ సరస్వతి పరిషత్ ఆటోరి యంలో ఇంటర్నేషనల్ హానరీ 2023 భారత్ ఐకాన్ అవార్డు అందజేయడం జరుగు తుం దని. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా ఎన్జీవో ఫౌండర్, చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. 77,వ ఇండిపెండెన్స్ డే పురస్కరించుకొని. స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియా, వెలుగు సామాజిక స్వచ్ఛంద సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ సురభి శ్రీధర్ చేస్తున్న సేవలను గుర్తించి భారత్ ఐకాన్ అవార్డు ఇవ్వడం జరుగుతుందని. లయన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు. డా, సురభి శ్రీధర్ జర్నలిస్టుగా రాణిస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతూ జర్నలిస్టుగానే కాకుండా. సామాజిక సేవే మార్గముగా చేయూతే లక్ష్యంగా ముందుకు సాగుతూ సామాజిక సేవ కార్యక్రమాలు చేస్తూ ఎంతో మందికి ఆదర్శంగా నిలుస్తున్న డాక్టర్ సురభి శ్రీధర్ ను గౌర అతిథిల చేతుల మీదుగా గౌరవించడం జరుగుతుందని. లయన్ డాక్టర్ ఆకుల రమేష్ తెలిపారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ

**మహేశ్వరం సెప్టెంబర్ 21సమ సమాజం:**మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని మన్సన్ పల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ, కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి .జడ్పీ చైర్ పర్సన్ అనిత రెడ్డి ,ఎమ్మెల్సీలు సురభి వాణీదేవి ,దయనంద్ గుప్తా ,యెగ్గె మల్లేశం ,కలెక్టర్ హరీష్ తో కలిసి లక్కీ డ్రా ద్వారా డబుల్ బెడ్ రూమ్ లు పొందిన వారికి సంబంధిత పత్రాలు, తాళాలు అందించిన మంత్రి సబితా ఇంద్రారెడ్డి. ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ...లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను 9700 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి నిర్మించాం అన్నారు. ఎవరికి ఒక్క రూపాయి లంచం ఇవ్వకుండా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా లబ్ధిదారులకు ఉచితంగా అత్యంత పారదర్శకంగా ఎంపిక చేసాం.

మానవ రహితంగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన ఆన్లైన్ ప్రక్రియ ద్వారా పూర్తి పారదర్శకంగా పార్టీలు,కుల,మతాలకతీతంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టడం జరిగింది. గూడు లేని పేదలను పక్కాగా గుర్తించి డ్రా కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ప్రతిపక్షాలు వారు పాలిస్తున్న రాష్టాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేపట్టకున్న,దేశానికే ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుండటంతో ఉనికి కోల్పోతున్నామని, ప్రజల్లో అపోహలు సృష్టిస్తూన్నారని మంత్రి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గములోని పలు గ్రామాల్లో ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నట్లు,అదేవిధంగా జాగా ఉన్న వారికి ఇల్లు కట్టుకోవటానికి 3 లక్షలు గృహ లక్ష్మీ పథకం కింద మంజూరు చేస్తామన్నారు.దపనిచేసే ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని,కేసీఆర్ వెన్నంటే ఉండాలన్నారు.



# అప్పుల బాధ భరించలేక మృతి చెందిన సీనియర్ బిజెపి కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

**మునుగోడు సెప్టెంబర్ 21: సమ సమాజం:** మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన పోషగోని వెంకన్న గత కొంతకాలం క్రితం నుండి అప్పుల బాధను భరించలేక బుధవారం రోజున మరణించారు. విషయం తెలుసుకున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ వారికి ఆదేశాను సారం వెంకన్న పార్థివ దేహానికి పూలమాలవేసి వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటూ వెంకన్న కుటుంబానికి 20,000 వేల రూపాయలు ఆర్థిక సాయం అందజేసి వారి కుటుంబాన్ని పరామర్శించిన బిజెపి మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సైదులు, కొంపల్లి సర్పంచ్ జాల వెంకటేశ్వర్లు యాదవ్, సీనియర్ నాయకులు దోటి నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



# ముగిసిన ఆదివాసి జాతీయ మహాసభలు.

తమిళనాడు రాష్ట్రంలోని నమ్మకల్ జిల్లా కేంద్రంలో ఈనెల 19 నుండి 21 వరకు జరిగిన ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ (ఆర్మ్)జాతీయ 4 వ మహాసభలు జయప్రదంగా ముగిశాయి. కార్యదర్శి నివేదికపై 16 రాష్ట్రాల నుండి 31 మంది ప్రతినిధులు మాట్లాడారు. దేశంలో గిరిజనులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై 8 తీర్మానాలను ఆమోదించారు. గిరిజన విద్య , అట్రాసిటీ చట్టం,గిరిజన మహిళా వంటి మూడు కమిషన్లు వేసి వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు పాల్గొని తమ అభిప్రాయాలను తెలియజేశారు.

**ప్రమాదంలో ఆదివాసీ హక్కులు**

**- బృందా కారత్**

గత మూడు రోజుల నుండి మహాసభలో పాల్గొంటూ సూచనలు సలహాలు ఇస్తున్న మాజీ రాజ్యసభ సభ్యురాలు బృందా కారత్ ముగింపు ఉపన్యాసం మాట్లాడుతూ రాజ్యాంగంలో గిరిజనులకు కల్పించిన హక్కులు, చట్టాలు కాలరాయపడుతున్నాయని, గతంలో ఎన్నడు లేని విధంగా ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఆదివాసీలను వనవాసీలుగా చిత్రీకరిస్తూ వారి హక్కులపై దాడి చేస్తున్నదని ఆరోపించారు. ఆదివాసి గిరిజనుల సంస్కృతి ,సాంప్రదాయాలు వేరుగా ఉన్నందున వారిని మతంతో సంబంధం లేకుండా ప్రకృతి ఆరాధికులుగా గుర్తింపు ఇవ్వడం ద్వారానే వారి ఉనికిని కాపాడగలుగుతామని




అన్నారు. గిరిజనులు సామాజిక ఆర్థిక రంగాల్లో రాణించాలని అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనిఫామ్ సివిల్ కోడ్ పేరుతో బిజెపి, ఆర్ఎస్ఎస్ భావజాలాన్ని ఆదివాసి గిరిజనులపై బలవంతంగా రుద్దుతుందని విమర్శించారు. ఆదివాసి గిరిజనుల సామూహిక జీవన విధానం, సంస్కృతి, సాంప్రదాయాలను పూర్తిగా కాలరాయడమేనని అన్నారు. అఖిలభారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ మాట్లాడుతూ ఆదివాసి గిరిజన రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక మార్కెట్ సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని పూర్తిగా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం ద్వారానే గిరిజనులు,ఇతర రైతులు రక్షించబడతారని అందుకు ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 17




మందితో జాతీయ నూతన ఎగ్జిక్యూటివ్ కమిటీ ఎన్నిక

**-నూతన జాతీయ చైర్మెన్ గా జతింద్ర చౌదరి**

**- నూతన జాతీయ కన్వీనర్ గా పులిన్ బాస్కి**

వైస్ చైర్మన్ లు గా బృందా కారత్,డా.మీడియం బాబురావు,ఆర్ సర్వన్,జెపి గావిత్,డి హెమ్రాం,నరేష్ జమాతియ,బి వి ఖని

కో కన్వీనర్ లుగా దులిచంద్ మీనా,తిరుపతి రావ్ ట్రెజరర్ ఢిల్లీ బాబు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా:- ఆర్. శ్రీరాం నాయక్,రాజాచంద్రన్ దే బర్మా,ఎస్. వై గావిత్,వికాస్ రావెల్ లు ఎన్నికయ్యారు. 67 మందితో కేంద్ర కమిటీ. ఇందులో తెలంగాణ రాష్ట్రం నుండి ఎం ధర్మానాయక్, డి రవి నాయక్, బండారు రవికుమార్, పూసం సచిన్ ఎన్నికయ్యారు. అభినందనలతో... ఆర్. శ్రీరాం నాయక్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలంగాణ గిరిజన సంఘం

# బీజేపీ ఇంధన రాజకీయాలు

2014లో భారతీయ జనతా పార్టీ దేశంలో అధికారం చేపట్టిన తర్వాత గత తొమ్మిదిన్నరేండ్లలో ప్రత్యేకించి ఇంధన ధరలు అడ్డూ అదుపు లేకుండా పెరుగుతూ వచ్చాయి. ఎన్నికలు జరిగే రాష్ట్రాల్లో మాత్రం తన రాజకీయ అవసరాల కోసం ఇంధన ధరలను పెంచుకుంటూ, తగ్గించుకుంటూ చమురు ధరలను ఫక్తు రాజకీయ ప్రక్రియగా మార్చింది. ఇంధన ధరలు పెంచడం వల్ల ముఖ్యంగా వ్యవసాయం, రవాణా, ప్యాకేజింగ్ రంగాలపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఫలితంగా నిత్యావసర వస్తువులు, కూరగాయల ధరలు భారతదేశ చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కనీవినీ ఎరుగని రీతిలో పెరిగాయి. ఈ ఏడాది జూలై నెలలో నిత్యావసరాల ధరలు 15 నెలల గరిష్ఠానికి చేరుకున్నాయి. వీటికి ప్రధాన కారణం ఇంధన ధరలు నిరంతరం పెంచుకుంటూ పోవటమే. దేశంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల సరాసరి తీసుకుంటే దేశంలో 75 శాతం ప్రజలు ఎల్పీజీ ఉపయోగిస్తున్నారు. దేశంలో ఎల్పీజీ ఉపయోగించాలని ఒకపక్క ప్రోత్సహిస్తూ, మరోపక్క ఉజ్వల లాంటి పథకాలు తీసుకువస్తూ దాని ధరను మాత్రం రోజురోజుకు పెంచుకుంటూ పోతున్నది. మన దేశంలో ఎల్పీజీ గ్యాస్ ధర ప్రపంచంలోనే అత్యధికం. ద్రవ్యోల్బణం పెరుగకుండా, ప్రజల కొనుగోలు శక్తి పడిపోకుండా ఉండాలంటే చమురు ధరలు తగ్గించాలని ఆర్బీఐ సూచించినా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవటం లేదు. ముడి చమురును అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్స్లో కొలుస్తారు. ఒక బ్యారెల్ అంటే సుమారు 159 లీటర్లు. మన దేశం దాదాపు 85 శాతం ముడి చమురును ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నది. ప్రపంచంలో అత్యధికంగా ముడిచమురు దిగుమతి చేసుకునే దేశాలలో మనది 3వ స్థానం. ముడి చమురుతో మన రిఫైనరీస్లో పెట్రోల్, డీజిల్తో పాటు ఇతర ఉప ఉత్పత్తులను తయారు చేస్తున్నాం. కనుక ఇంధన ధరలు డాలర్ ధర ఆధారంగా పెరగటం కానీ, తగ్గడం కానీ జరగాలి. 2013 వరకు అంతర్జాతీయ ధరలకు అనుగుణంగానే ధరల పెరుగుదల ఉండేది. కానీ 2014 తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయింది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చేనాటికి దేశంలో పెట్రోల్ ధర రూ.77, డీజిల్ ధర రూ.68. ఆ సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో బ్యారెల్ ధర 105 డాలర్లు. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రోజు పెట్రోల్ ధర రూ.110, డీజిల్ ధర రూ.110. ఇక్కడ విచిత్రమైన విషయం ఏమిటంటే ఇప్పుడు బ్యారెల్ ధర 80 డాలర్లు మాత్రమే. ఇదే కాకుండా గ్యాస్ సిలిండర్ ధర రూ.400 నుంచి రూ.1000 కి చేరింది. ప్రపంచ మార్కెట్లో ఒక పక్క బ్యారెల్ ధర రోజురోజుకు తగ్గుతున్నా, కేంద్రం చమురు ధరలు మాత్రం పెంచుకుంటూ పోతున్నది. 2016లో ఒక దశలో 26 డాలర్లకు పడిపోయినా బీజేపీ ప్రభుత్వానికి ఈ దేశ ప్రజలపై కనికరం కలగలేదు. పెట్రోల్, డీజిల్ ధరలు ఏ మాత్రం తగ్గంచలేదు. చాలాకాలం పాటు బ్యారల్ ధర 40, 50 డాలర్ల మధ్య కొనసాగింది. కానీ ఆ కాలంలో కూడా డీజిల్, ఇంధన ధరలలో తగ్గుదల కనిపించలేదు. మన దగ్గర ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ద్వారా పెట్రోల్, డీజిల్ కొంటున్న నేపాల్లో కూడా మన కంటే తక్కువ ధర ఉన్నది. 2013 కంటే ముందు అంతర్జాతీయ మార్కెట్కు అనుగుణంగా దేశంలో ఇంధన ధరల నియంత్రణ కొనసాగేది. కానీ బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజల జీవితాల్లో అత్యంత ముఖ్యమైన ఇంధన ధరలను కేవలం రాజకీయ అవసరాల కోసం మాత్రమే పెంచుకుంటూ, తగ్గించుకుంటూ దీన్ని ఫక్తు రాజకీయ ప్రక్రియగా మార్చింది. కరోనా కారణంగా ఉద్యోగాలు పోయి జీవితాలు ఛిద్రమై కొన్ని కోట్ల మంది రోడ్డున పడ్డా పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ గ్యాస్ ధరలను తగ్గించలేదు. పైగా ఉచిత వ్యాక్సిన్, గ్రామీణ ఉపాధి కోసం నిధులు కావాలని చెప్పింది. ఆ సమయంలో అంతర్జాతీయ మార్కెట్లో ముడిచమురు ధర అతి తక్కువగా ఉన్నది. అయినప్పటికీ ఈ దేశ ప్రజలు ఆ ప్రయోజనాన్ని పొందలేకపోయారు. కానీ హిమాచల్ప్రదేశ్, రాజస్థాన్, బెంగాల్ ఉప ఎన్నికల్లో ఘోర పరాజయం తర్వాత 2022లో 5 రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఛీ కొడతారని భయపడి ఉత్తరప్రదేశ్, గోవా, మణిపూర్, పంజాబ్, ఉత్తరాఖండ్ ఎన్నికల ముందు పెట్రోల్పై రూ.5, డీజిల్పై రూ.10 తగ్గించింది. తర్వాత 137



రోజులు అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నా 5 రాష్ట్రాల ఎన్నికలు ముగిసేవరకు ఒక్క పైసా పెంచలేదు. ఇందులో ఓట్ల కోసం కాకపోతే దేశ ప్రజలపై ప్రేమ, దేశభక్తి ఎక్కడ కనిపిస్తుందో బీజేపీ నాయకత్వం చెప్పాలి. మోదీ ప్రధాని అయిన తర్వాత 10 రక్షాబంధన్లు వచ్చాయి. ఏ రక్షాబంధన్కు దేశ మహిళలకు కానుక ఇవ్వలేదు. కానీ కర్ణాటక ఎన్నికల్లో చావుదెబ్బ తిన్న తర్వాత రానున్న 5 రాష్ట్రాల్లో (తెలంగాణ, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్గడ్, మిజోరాం) అధికారం దక్కడం అసాధ్యమని తెలిసి దేశ ప్రజలకు రక్షాబంధన్ కానుకగా మోదీ సిలిండర్పై రూ. 200 తగ్గించాడు. ఇదే సందర్భంలో తాను అధికారంలోకి వచ్చిన తర్వాత పెంచిన రూ.800 గురించి దేశ ప్రజలకు వివరణ ఇవ్వాల్సిన అవసరం మోదీపై ఉన్నది. 2014లో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నిరకాల ఇంధనాలపై 300 శాతానికి పైగా ట్యాక్స్లు పెంచడం జరిగింది. రాష్ట్రాలు పెద్దగా ట్యాక్స్లు పెంచలేదు. ఉదాహరణకు తెలంగాణ రాష్ట్రం గడిచిన పదేండ్లలో పెట్రోల్, డీజిల్పై ఒక రూపాయి కూడా ట్యాక్స్ పెంచలేదు. కానీ కేంద్ర ప్రభుత్వాన్ని వదిలేసి కనీస జ్ఞానం లేకుండా ఇక్కడి బీజేపీ నాయకులు బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు. కేంద్రానికి అనేక ఆదాయ వనరులుంటాయి.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **Panidhar PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
RNI.TELTEL/2016/ 73311, Cell:8464816456 Email: samasamajamdaily@gmail.com, Website: www.samasamajam.in